సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 21 । ఏప్రిల్ । 2023




ముగిసిన ముత్యాలమ్మ జాతర

చింతపల్లిలో జరుగుతున్న ముత్యాలమ్మ జాతర గురువారం ఘనంగా ముగిసింది. భక్తులతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. 8లో



నిప్పుల కొలిమి

ఎప్పుడూ కూల్‌కూల్‌గా ఉండే మన్యం ఇప్పుడు పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా నిప్పుల కొలిమిని తలపిస్తోంది. 8లో



వెంకన్న భక్తులకు శుభవార్త

- వచ్చేనెల 17 నుంచి జాగరంపల్లిలో శ్రీవారి ఆలయ మహా సంప్రోక్షణ
- టీటీడీ జేఈవో వీరబ్రహ్మం
- ఏర్పాట్లు పరిశీలన



వెంకన్న ఆలయంలో పనులను పరిశీలిస్తున్న టీటీడీ జేఈవో వీరబ్రహ్మం

రంపచోడవరం: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన రంపచోడవరానికి సమీపంలోని జాగరంపల్లి వద్ద టీటీడీ నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి ఆలయ మహా సంప్రోక్షణ కార్యక్రమాలు వచ్చే నెల 17 నుంచి 22 వరకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తెలపారు. ఆలయ నిర్మాణ పనులను గురువారం ఆయన ఆధ్వర్యంలో అధికారుల బృందం పరిశీలించింది. అనంతరం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆలయ ప్రవేశ మార్గంలో ఆర్చి, ఆలయంలో బోరు, వాటర్ పంపింగ్ ప్లాంట్, సెక్యూరిటీ సిబ్బంది గది, కార్యాలయ గది నిర్మాణ పనుల వేగం పెంచాలని ఆయన అధికారులను ఆదేశించారు. భద్రత చర్యల్లో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

మహాసంప్రోక్షణకు అవసరమైన పంచలోహ విగ్రహాలు, ఆభరణాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీకి అనువైన చోట కౌంటర్ ఏర్పాటు చేయాలని, నాలుగు మాఢ వీధుల్లో పనులు వేగం పెంచాలని సూచించారు. వాహనాల పార్కింగ్‌కు అవసరమైన స్థలాన్ని గుర్తించాలని ఆదేశించారు. ఆలయానికి వచ్చే రోడ్డు మార్గంలో సోలార్ విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని, ఆలయం చుట్టూ, ఆలయ గోపురం పైన విద్యుత్ అలంకరణలు ఆకట్టుకునేలా ఉండాలన్నారు. ఆలయానికి సమీపంలోని కొండ మీద శంఖు చక్రాలు ఏర్పాటు చేయాలన్నారు. గోపురానికి పిడుగుల నుంచి రక్షణ కల్పించేలా తగిన ఏర్పాట్లు చేయాలని ఆయన అన్నారు. చుట్టుపక్కల ప్రాంతాలైన రాజమండ్రి, అడ్డతీగల, రాజవొమ్మంగి, గోకవరం ప్రాంతాలనుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చేలా ప్రచారం నిర్వహించాలని సూచించారు.

వసతి, భోజన ఏర్పాట్లపై చర్చ

మహాసంప్రోక్షణ కార్యక్రమాల నిర్వహణకు వచ్చే అర్చకులు, వేద పండితులు,అధికారులు, సిబ్బందికి వసతి, భోజన ఏర్పాట్ల గురించి జేఈవో వీరబ్రహ్మం అధికారులతో చర్చించారు.

మహాసంప్రోక్షణ సందర్భంగా వేలాదిమంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీరందరికీ తాగునీరు, అన్నప్రసాదాల వితరణ మీద ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం ఆయన ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఏఎస్పీ అదిరాజ్ సింగ్ రాణాతో మహాసంప్రోక్షణ ఏర్పాట్లపై చర్చించారు. టీటీడీ చీఫ్ ఇంజినీర్ శ్రీనాగేశ్వరరావు, ఎస్ఈలు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈవోలు గుణభూషణ్ రెడ్డి, వెంకటయ్య, వీజీవో శ్రీమనోహర్, ఏఈవో శ్రీరమేష్ పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల నమోదు చేపట్టాలి

- అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

పెదబయలు: జిల్లాలో 18 ఏళ్లు పైబడిన వారందరికి ఓటు నమోదు కార్యక్రమం చేపట్టాలని అసిస్టెంట్ కలెక్టర్ అశుతోస్ శ్రీవాత్సవ ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 23 పంచాయతీల బూత్ లెవెల్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు.

నూతన ఓటరు నమోదుకు ఫారం-6లో దరఖాస్తు చేయించాలని, మృతుల పేర్లు తొలగింపు, అలాగే ఇది వరకే ఉన్న ఓటర్లను ఆధార్, ఫోన్ నంబరుతో అనుసంధానం చేయాలని ఆదేశించారు. గ్రామ సచివాలయాలు, రెవెన్యూ శాఖ ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు. భూ రీసర్వే కార్యక్రమం వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి స్థానిక తహసీల్దార్ భాస్కరరావు, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.



పెదబయలులో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ





అక్షయ తృతీయ.. 'నగ'ధగలు

మహారాణిపేట: అక్షయ తృతీయ హిందువులకు పవిత్రమైన రోజు. వైశాఖ మాసం శుక్ల పక్ష తృతీయ నాడు అక్షయ తృతీయగా జరుపుకుంటారు. అక్షయ అంటే ఎప్పటికీ తరగనిది అని అర్థం. శివపురాణం ప్రకారం.. సిరి సంపదలకు అధిపతి అయిన కుబేరుడు పరమేశ్వరుడినిప్రార్థించగా అక్షయ తృతీయ రోజున లక్ష్మీ అనుగ్రహాన్ని ఇచ్చినట్లు చెబుతారు. అందుకే ఈ రోజున బంగారం కొంటే అంతులేని సిరి సంపదలు కలుగుతాయని భావిస్తారు. రెండేళ్ల కోవిడ్ సంబంధిత అవాంతరాలు, గతేడాది ఓ మాదిరిగా అమ్మకాలు జరగ్గా.. ఈ ఏడాది అక్షయ తృతీయపై వ్యాపారులు పూర్తి ఆశావాహ దృక్పథంతో ఉన్నారు. ఆర్థిక కార్యకలాపాలు క్రమంగా పెరుగుతున్నందున అమ్మకాలు గతం కంటే అధిగమిస్తాయని ఆశిస్తున్నారు. ఇటీవల పెరిగిన బంగారం ధరలు అడ్డంకిగా మారవచ్చని కూడా కొందరు భావిస్తున్నారు. ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.60,930, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.55,850 వద్ద ఉన్న సంగతి తెలిసిందే. విశాఖ జిల్లాలో సుమారు 200 వరకు బంగారం దుకాణాలు ఉన్నాయి. జగదాంబ, జడ్జి కోర్టు, కురుపాం మార్కెట్, ద్వారకానగర్, సంపత్ వినాయనగర్ రోడ్డు, గోపాలపట్నం, మద్దిలపాలెం, కంచరపాలెం, గాజువాక, మధురవాడ తదితర ప్రాంతాల్లో కార్పొరేట్ షాపులతో పాటు స్థానిక వర్తకులు బంగారు దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఈనెల 22వ తేదీన అక్షయ తృతీయ నేపథ్యంలో బంగారు దుకాణాలను అలంకరించారు. వివిధ మోడళ్లలో బంగారు ఆభరణాలు అందుబాటులో ఉంచడంతో పాటు క్యాష్‌బ్యాక్ ఆఫర్లు ప్రకటించారు. ప్రతి గ్రాముపై తగ్గింపు ధరలు, తరుగులో తగ్గింపు ఇస్తున్నారు.

అమ్మకాలు పుంజుకుంటాయని వర్తకుల ఆశాభావం

కొనుగోలులో జాగ్రత్తలు అవసరం

అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా ప్రతి ఒక్కరూ బంగారం కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తారు. అయితే బంగారం కొనే సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి బంగారు వస్తువులు, ఆభరణాలు కొనుగోలుకు సంబంధించి కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) ఆరు అంకెల ఆల్ఫాన్యూమరిక్ హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ (హెచ్‌యూఐడీ) లేకుండా బంగారు ఆభరణాలు విక్రయించడాన్ని నిషేధించింది.



ఆశాభావంతో ఉన్నాం



అక్షయ తృతీయ కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. వివిధ రకాల మోడళ్లలో బంగారు ఆభరణాలు అందుబాటులో ఉంచాం. ముఖ్యంగా మహిళల కోసం సరికొత్త డిజైన్లు షాపులో కొలువుదీరాయి. ఈ ఏడాది బంగారం అమ్మకాలు ఎక్కువగా ఉంటాయని ఆశాభావంతో ఉన్నాం.

– మంచుకొండ అప్పలరాజు శ్రీరంగ

అంతా మంచే జరుగుతుంది



అక్షయ తృతీయ అత్యంత పవిత్రమైనది. ఈ రోజున బంగారం కొనడం వల్ల ఐశ్వర్యం, అదృష్టం కలుగుతుందని నమ్మకం. మా కొనుగోలుదారుల కోసం అవసరమైన వెరైటీలతో బంగారు ఆభరణాలు సిద్ధంగా ఉంచాం. ప్రత్యేక ఆఫర్లు ప్రకటించాం.

– వైశ్యరాజు భద్రగిరిరాజు

జూనియర్ సివిల్ జడ్జిల బదిలీ

సాక్షి, విశాఖపట్నం: జిల్లాలో పలువురు జూనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేస్తూ గురువారం రాత్రి హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు జిల్లా పాకల జూనియర్ సివిల్ న్యాయస్థానం న్యాయమూర్తి కె.అనురాగ్ అలియాస్ కె.అనూష విశాఖలోని ఆరో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు(రైల్వే న్యాయస్థానం) న్యాయమూర్తిగా బదిలీపై వస్తున్నారు. ఆ స్థానంలోనున్న న్యాయమూర్తి సిహెచ్.శ్రీనివాసబాబు కృష్ణా జిల్లా గన్నవరం ప్రధాన జూనియర్ సివిల్ న్యాయస్థానం న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. కృష్ణా జిల్లా గన్నవరం ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వి.గంగాభవాని బదిలీపై విశాఖలోని ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా వస్తున్నారు. ఆ స్థానంలోనున్న న్యాయమూర్తి జి.సాయికృష్ణ పశ్చిమ గోదావరి జిల్లా, కొవ్వూరు రెండో అదనపు జూనియర్ సివిల్ న్యాయస్థానం న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు.







క్లుప్తంగా

ఘనంగా ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందు ఇచ్చిన అధికారులను సన్మానిస్తున్న ముస్లిం సోదరులు

సాక్షి,పాడేరు: స్థానిక మసీదులో ముస్లిం కుటుంబాలకు పలువురు అధికారులు గురువారం సాయంత్రం ఇఫ్తార్ విందు నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ ఏడీ రాజా రవికుమార్, ఎస్‌బీఐ మేనేజర్ శ్రీధర్, డాక్టర్ బాబ్జిలు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అలాగే లోక కల్యాణార్థం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసిన అధికారులను ముస్లిం సోదరులు శాలువా కప్పి సత్కరించారు. మత గురువు మహ్మద్ అలీ, మసీదు అభివృద్ధి కమిటీ ప్రతినిధులు అబ్దుల్లా, ఇక్బాల్, సులేమాన్, మహ్మద్, మస్తాన్, సామిన్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆశా వర్కర్ మృతి

- మృతదేహాన్ని డోలీలో తరలింపు


లక్ష్మి మృతదేహాన్ని డోలీలో తీసుకెళ్తున్న గ్రామస్తులు

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీ కొత్తపల్లి ఆశా వర్కర్ కొర్రా లక్ష్మి(49) కొమ్మికలోని బంధువుల ఇంటిలో మృతి చెందింది. ఆమె ఇటీవల అక్కడికి వెళ్లింది. బుధవారం రాత్రి తీవ్ర అనారోగ్యానికి గురైన ఆమెను బంధువులు వెంటనే కంఠారం ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టు వైద్యసిబ్బంది ధ్రువీకరించారు. దీంతో ఆమె మృతదేహాన్ని గురువారం కొమ్మిక నుంచి కొత్తపల్లికి ఐదు కిలోమీటర్ల దూరం వరకు వాహనంలో తీసుకు వచ్చారు. అక్కడ నుంచి వాహనం వెళ్లేందుకు రోడ్డు లేకపోవడంతో ఐదు కిలోమీటర్ల మేర అడవిమార్గంలో డోలీలో మోసుకొని తీసుకువెళ్లారు. ఆమె మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

29న నవోదయ ప్రవేశ పరీక్ష

చింతూరు: నవోదయ ప్రవేశ పరీక్ష ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌కే సలీంబాషా గురువారం తెలిపారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి రంపచోడవరం డివిజన్‌లో ఐదు, చింతూరు డివిజన్లో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ఎంఈవోలను సిట్టింగ్ స్క్వాడ్‌గా నియమించినట్లు డీఈవో తెలిపారు.

ముగిసిన ముత్యాలమ్మ జాతర

- చివరిరోజు పోటెత్తిన భక్తజనం

చింతపల్లి: మండల కేంద్రంలో జరుగుతున్న ముత్యాలమ్మ జాతర గురువారం ఘనంగా ముగిసింది. చివరి రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది తరలి రావడంతో రోడ్లన్నీ కిక్కిరిసి పోయాయి. అమ్మవారిని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయం నుంచి నిర్వహించిన గరగల ఊరేగింపులో ఎమ్మెల్యే, ఎంపీలు పాల్గొన్నారు. వారి ఆధ్వర్యంలో ఘటాలను సుర్ల వంశీయుల ఇంటి వద్దకు తీసుకువెళ్లి యథాస్థానంలో ఉంచారు. ఘటాల ఊరేగింపులో ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భారీ ఎత్తున మందుగుండు కాల్చారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి


ఊరేగింపులో ఆకట్టుకున్న శక్తి వేషాలు

భక్తుల సౌకర్యార్థం పలు చోట్ల పోలీస్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. అమ్మవారిని ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీలు పోతురాజు బాలయ్య, వెంకటలక్ష్మి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దురియా హేమంత్, మాజీ ఎంపీపీ గంగరాజు, సర్పంచ్ దురియా పుష్పలత, సీఐ రమేష్ తదితరులు దర్శించుకున్నారు.

భక్తులకు మజ్జిగ సరఫరా

చింతపల్లి రూరల్: ముత్యాలమ్మ జాతర సందర్భంగా భారీ సంఖ్యలో తరలి వచ్చిన భక్తులకు గురువారం మజ్జిగ సరఫరా చేశారు. కేసీపీ సిమెంటు వారి సహకారంతో ఏర్పాటుచేసిన మజ్జిగ కేంద్రాన్ని ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ప్రారంభించారు.

పేదల సంక్షేమానికి ప్రాధాన్యం

- హుకుంపేట, గంగవరంలో గడప గడపకు విశేష స్పందన
- సమస్యల పరిష్కారానికి అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మిల హామీ

హుకుంపేట: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పేద ప్రజలంత క్షేమంగా జీవనం కొనసాగిస్తున్నారని అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాప పంచాయతీ గాంగుపుట్టు, తీన్‌రాయి, దాలేంపుట్టు, రాప, దంపులపడవ, కోట గరువు గ్రామల్లోని 235 గడపలను సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి యోగ క్షేమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామల్లో పూలమాలలతో ఎమ్మెల్యేను గిరిజనులు ఘనంగా స్వాగతం పలికారు. తీన్‌రాయి, రాప గ్రామస్తులు తమ గ్రామల్లో తాగునీరు సమస్య విపరీతంగా ఉందని ఎమ్మెల్యేకు విన్నవించగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా గిరిజనులతో మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. గ్రామంలో తాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్లు సమస్యలు తీరుస్తానని హామి ఇచ్చారు. జగనన్న పాలనలో ప్రతీ పేదకుటుంబ క్షేమంగా జీవిస్తున్నారన్నారు. అనంతరం రాప, సంతారి సచివాలయ కేంద్రాల్లో సందర్శించారు. రికార్డులను పరిశీలించారు.ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అర్హులైన ప్రతీ ఇక్కరికి అందేలా పనిచేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, సర్పంచ్‌లు సోమెలి లక్ష్మయ్య, అప్పలనాయుడు, ఎంపిటీసీలు నాగలక్ష్మి, సుశీల, మండల యువజన కార్యదర్శి వెంకట్, నాయకులు భూషణ్, చిన్నబ్బి, ధర్మయ్య దొర, ఈశ్వరనాయుడు తదితరులు పాల్గొన్నారు.


నేల మీద కూర్చొని స్థానికులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అర్హులకు సంక్షేమ ఫలాలు

గంగవరం: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. గురువారం మోహనాపురం గ్రామ సచివాలయం పరిధిలో పంద్రప్రోలు పంచాయతీలో బ్రిమామిడి, కరకపాడు గ్రామాల్లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడపగడపనూ ఎమ్మెల్యే సందర్శించి ప్రభుత్వ పథకాల లబ్ధిపొందిన లబ్ధిదారులతో మాట్లాడారు. కరకపాడు బ్రిమామిడి గిరిజనులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, సర్పంచ్ తమ్మన్నదొర, ఉప సర్పంచ్ మోహన్, ఆర్‌ఐ ఫయాజ్‌భాషా, ఎంఈవో మల్లేశ్వరరావు, వ్యవసాయాధికారి విశ్వనాథ్, సీఐ రాంబాబు, సర్పంచ్‌లు అక్కమ్మ, కామరాజుదొర, రామలక్ష్మి, పార్టీ మండల ఇన్‌ఛార్జి రఘునాథ్, నాయకులు రామకృష్ణ, బాబి, ప్రసాద్, వీఆర్వో అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.


కరకపాడులో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

బావిలో దూకి విద్యార్థిని ఆత్మహత్య

పాడేరు రూరల్ : చిన్నపాటి కారణంతో క్షణికావేశంతో తీసుకున్న నిర్ణయంతో ఓ విద్యార్థిని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని కాడెలి పంచాయతీ వర్తనాపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పాడేరు ఎస్‌ఐ లక్ష్మణ్‌రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వర్తనాపల్లి గ్రామానికి చెందిన మాద శివలక్ష్మి(14) జి.మాడుగుల మండలం బందవీధి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈనెల 15న పాఠశాల నుంచి ఇంటికి వచ్చింది. ఈనెల 18న ఇంట్లో కుక్కలు దూరి చిందరవందర చేసిందనే కారణంతో ఆమె తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన విద్యార్థిని శివలక్ష్మి అదే రోజు ఇంటి నుంచి బయటకు వెళ్ళిపోయింది. ఆరోజు నుండి తన కూతురి ఆచూకీ కోసం తల్లి గాలించింది. అయినప్పటికి ఫలితం లేకపోయింది. గురువారం గ్రామ శివార్లోని పాడుబడిన బావిలో స్థానికులకు మృతదేహం తేలియాడుతూ కనిపించింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ లక్ష్మణ్‌రావు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. ఇంటి నుంచి వెళ్ళిపోయిన విద్యార్థిని శివలక్ష్మిగా నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. శవపంచనామ నిర్వహించి పాడేరు జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నామని ఎస్‌ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.


విద్యార్థిని శివలక్ష్మి మృతదేహం

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

వై.రామవరం: మండలంలోని కోట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని బట్ట వెంకటలక్ష్మి(13) బుధవారం రాత్రి అనారోగ్యంతో బట్టావారి వీధిలోని ఇంటివద్దనే మృతి చెందింది. అనారోగ్యంతో ఉన్న ఆమెను కొద్దిరోజుల క్రితం తల్లిదండ్రులు ఇంటికి తీసుకువెళ్లారు. ఈనేపథ్యంలో ఆరోగ్యపరిస్థితి విషమించి మృతి చెందింది.

ఆర్థిక లావాదేవీల స్టేట్‌మెంట్‌కు పాన్ తప్పనిసరి

- స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ

సాక్షి, విశాఖపట్నం : ఆదాయపు పన్ను ఆర్థిక లావాదేవీల స్టేట్‌మెంట్ (ఎస్‌ఎఫ్‌టీ) దాఖలు చేసేటప్పుడు రూ.10 లక్షలు పైబడిన ప్రతి లావాదేవీకి కచ్చితంగా పాన్ నంబర్ అవసరమని రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ జి.బాలకృష్ణ స్పష్టం చేశారు. విశాఖలోని ఆదాయపు పన్ను శాఖ కార్యాలయంలో ఎస్‌ఎఫ్‌టీ ఫైలింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలకు సంబంధించి స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన జిల్లా రిజిస్ట్రార్లు, సంయుక్త సహాయ రిజిస్ట్రార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయపు పన్నుశాఖ సూచనల మేరకు ఎస్‌ఎఫ్‌టీ పొందుపరిచే సమయంలో తప్పులు దొర్లకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఐటీ శాఖ ఇంటిలిజెన్స్ అండ్ క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ అధికారి ఎంవీఎస్‌ఎస్ భవన్నారాయణ మాట్లాడుతూ స్థిరాస్తుల విక్రయాలు, కొనుగోళ్లకు సంబంధించి రూ.30 లక్షలు విలువ మించిన లావాదేవీల సమాచారాన్ని ఎలాంటి తప్పులు లేకుండా పొందుపరచాలన్నారు. వీటికి సంబంధించిన స్టేట్‌మెంట్స్ ఫైల్ చేసేందుకు మే 31వ తేదీ తుది గడువు అని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ బాలకృష్ణ, ఐటీ అధికారి భావనారాయణ

నిప్పుల కొలిమి

- మన్యంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఠారెత్తిస్తున్న భానుడు

సాక్షి,పాడేరు: ఎప్పుడూ కూల్‌కూల్‌గా ఉండే మన్యం ఇప్పుడు పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా నిప్పుల కొలిమిని తలపిస్తోంది. పర్యాటక కేంద్రాలుగా గుర్తింపు పొందిన అరకు, పాడేరు, చింతపల్లి ప్రాంతాల్లో 32 నుంచి 35 డిగ్రీల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ఎండ వేడిమిని తాళలేక మన్యం వాసులు అల్లాడిపోతున్నారు.చింతూరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో సుమారు 42 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భానుడు ఠారెత్తించాడు. పాఠశాలల నుంచి ఇళ్లకు వెళ్లేందుకు చిన్నారులు వేసవి తాపానికి గురయ్యారు.గుత్తులపుట్టు వారపుసంతపై ఎండ తీవ్రత ప్రభావం చూపింది.

రాజవొమ్మంగి: మండల కేంద్రమైన రాజవొమ్మంగి పరిసరాల ప్రజలు ఉష్ణతాపానికి విలవిల్లాడారు.ఉక్కబోత, వేడిమి మన్యవాసులను ఉక్కిరిబిక్కిరి చేసింది. జీడిమామిడి పంట సేకరించేందుకు రైతులు ఆపసోపాలు పడ్డారు.ఉపాధి కూలీలు వేగంగా పనులు ముగించుకొని ఇళ్లకు చేరారు.


కె.కోడాపల్లి ప్రాంతంలో చింత చెట్లు నీడన సేదతీరుతున్న కూలీలు


రాజవొమ్మంగిలో ఎండవేడిమికి తలపై తువ్వాళ్ల కప్పుకొని వెళ్తున్న గ్రామస్తులు

ట్రస్ట్ బేరింగ్ కూలర్ క్లీనింగ్ పనులు ప్రారంభం


ట్రస్ట్ బేరింగ్ కూలర్ క్లీనింగ్ పనులు జరుగుతున్న దృశ్యం

సీలేరు (అల్లూరి సీతారామరాజు): సీలేరు జలవిద్యుత్ కేంద్రంలోని నాలుగు యూనిట్లలో నాలుగో నంబర్ యూనిట్‌లో ట్రస్ట్ బేరింగ్ కూలర్ క్లీనింగ్ పనులు చేపట్టినట్టు జెన్‌కో ఈఈ లక్ష్మీనారాయణ తెలిపారు. నిర్వహణ పనుల్లో భాగంగా క్లీనింగ్ పనులను ఉన్నతాధికారుల అనుమతితో గురువారం ప్రారంభించినట్టు ఆయన పేర్కొన్నారు. మూడు రోజుల్లో ఈ పనులు పూర్తవుతాయన్నారు. ప్రస్తుతం సీలేరు కాంప్లెక్స్ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున అవసరమైన సమయంలో మాత్రమే మిగతా మూడు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని ఆయన వివరించారు.

దివ్యాంగులకు అండగా స్వచ్ఛంద సంస్థలు

- రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్


దివ్యాంగులకు చెక్కును అందజేస్తున్న ఎంపీపీ శ్రీదేవి , ట్రస్టు సభ్యులు

రంపచోడవరం: దివ్యాంగులకు ఆసరాగా నిలవడంలో స్వచ్ఛంధ సంస్థల పాత్ర అభినందనీయమని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ అన్నారు. రంపచోడవరం పీఎంఆర్‌సీలో గురువారం ఉమమా ఎడ్యుకేషన్ అండ్ టెక్నికల్ సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులకు అవసరమైన సహాయ పరికరాలను మూడు- వీల్ చైర్లు, 2-కృత్రిమ కాళ్ళు, 2-కాలిపర్స్, 4 -ఎల్బోక్రచ్చర్, 2-అంధుల చేతి కర్రలను అందజేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఉమా ఎడ్యుకేషన్ అండ్ టెక్నికల్ సంస్థను, బోన్ జర్మనీ సంస్థ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో రంపచోడవరం ఎంపీపీ బందం శ్రీదేవి దివ్యాంగులకు జీవనోపాధులకు అవసరమైన రుణాల చెక్‌ను అందజేశారు. అలాగే దివ్యాంగుల వివాహ జంటలకు ఆర్థిక ప్రోత్సాహం, శస్త్ర చికిత్సలు చేయించుకున్న పది మందితో కలిపి రూ.5.18లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. దివ్యాంగుల భవిష్యత్ ప్రణాళికలను తెలుసుకున్నారు. ఎంపీపీ శ్రీదేవి మాట్లాడుతూ సమాజంలో దివ్యాంగులకు భరోసాగా జీవించేందుకు వారికి చేయూతనివ్వడంతో సంతోషకరమన్నారు. ఉమా ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎస్‌పీ రెడ్డి మాట్లాడుతూ రంపచోడవరం మండలంలో పనిచేస్తున్న సమాజ ఆధారిత పునరావాస కార్యక్రమాలను పరిశీలించేందుకు ఐక్యా, ఇండియన్ డెస్క్ అధికారి అంధేరి వాల్బెబోన్ జర్మనీ, ఎస్.అలుగ్రామ సౌత్ రీజనల్ కో-ఆర్డినేటర్‌లు మూడు రోజులు పర్యటిస్తారని తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


- జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్


మాంసం దుకాణాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్

అరకులోయ రూరల్: నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు సాగిస్తే చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ హెచ్చరించారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాంసం దుకాణాలు, హోటళ్ల పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని దృష్టిలోపెట్టుకుని నాణ్యమైన ఉత్ప త్తులు విక్రయించాలని సూచించారు. పశువైద్యశాఖ అధికారులు ధ్రువీకరించిన మేక, గొర్రెలకు సంబంధించిన మాంసాలు మాత్రమే విక్రయించాలని ఆదేశించారు. అనంతరం స్థానిక ఏఎంసీ చైర్మన్ కిల్లో రాజారమేష్‌తో సమావేశమయ్యారు. సంతల్లో మోసాలను అరికట్టేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వైస్ ఎంపీపీ రామన్న, కోఆప్షన్ సభ్యుడు రహింతుల్లా పాల్గొన్నారు.

రోగులకు సకాలంలో వైద్యసేవలు

- ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే


పీహెచ్‌సీ క్వార్టర్లను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

మారేడుమిల్లి : పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. గురువారం ఆయన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలను, పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలించారు. ఎప్పటికప్పుడు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సిబ్బంది క్వార్టర్లను పరిశీలించారు. నిరుపయోగంగా ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టాలని ఆయనను సిబ్బంది కోరారు. అనంతరం బర్త్‌వెయిటింగ్ హాల్‌ను తనిఖీ చేశారు. గర్భిణుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు.తహసీల్దార్ శ్రీనివాస్, వైద్యాధికారులు శ్రీనివాస్, హరికృష్ణ పాల్గొన్నారు.